
# ఉయ్యాల భామ

ఆర్.యస్.కె. మూర్తి

ఆ పిల్ల ఒక శలాక. ఒక విద్యుల్లత. అతగాడేమో మబ్బు. ఒక బుద్ధూ. వాళ్ళ మధ్యనో మరిది గాని మరిది. వాళ్ళ కాపురం — ఆ పది పోర్షన్ల భవంతి — కాంపౌండులో ముందు వైపున నున్న — రేకుల షెడ్డులో.

భవంతిలో ముందు పోర్షనే మా నివాసం.



నాలుగు నెలల పాటు కొడుకు దగ్గర ఉండి పోదామని వచ్చాం — మా వృద్ధ దంపతులం. హైదరాబాద్ నగరానికి.

హైదరాబాద్ నగరం మాకు కొత్తేమీ కాదు. కొత్తల్లా శలాకతో మా అనుభవమే.

"అయితే తాతయ్యా, మీరు మాస్టారీ చేసి రిటైరయ్యారా? మీరైతే మీరిలాత పొట్టి గదా, పొడుగాటి పిల్లల్ని కొట్టాలంటే మీరేం చేసేవారు? స్టాండ్ అప్ ఆన్ ది బెంచ్ చేసి కొట్టేవారా?"

ఇదీ ఆ చిచింద్రీ మొదటిసారిగా నన్ను పలకరించిన వైనం. అదీ మా పోర్షనులోకి వచ్చి.

ఆ పిల్ల మాటలకు నాకు కోపమూ రాలేదు కంగారూ పడలేదు. తాపీగానే చెప్పాను. "ఏముందమ్మా, నీలాగా పొడుగ్గా ఉన్న పిల్లల చేత కొట్టించేవాడిని."

నవ్వులను అణచిపెట్టుకున్నాను. ఎందుకంటే ఆ పిల్ల నా కంటే పొట్టి.

"అమ్మో! తాతయ్యా — బలే దెబ్బ కొట్టావే. కోపమొచ్చిందా?"

గలగలా నవ్వింది ఆ మెరుపు తీగె. ధ్వజస్తంభం చిరు గంటలకు మల్లే.

ఆ క్షణంలోనే ఆమెందుకో నాకు ఆప్తురాలైపోయింది.

అట్లా పరిచయమైనప్పటి నుంచీ ఆ పిల్ల నా వయసు మీద, రూపం మీద ఏదో జోక్‌లు వేయడం — నేను అంతులేని ఆనందాన్ని అనుభవించడం. ఇదో దిన చర్య అయిపోయింది. నా విశ్రాంతి జీవితంలో.

ఇట్లా ఎందుకోగాని — ఆ పిల్లకు రోజు రోజుకీ నా మీద అభిమానం పెరుగుతూనే ఉంది. అంతులేని గౌరవ భావం ఆమె నాపై ఏర్పరచుకుంటున్నది. నలభై సంవత్సరాలు పైగా నేను ఉపాధ్యాయుడిగా పని చేసిన వైనం. నా ప్రవర్తనలోని సౌజన్యం... మాటల్లోని మృదుత్వం... బహుశా ఇవన్నీ నన్నామెకు ప్రేమాస్పదుడిని చేసి ఉండవచ్చు.

నా బెడ్ రూంలో కూర్చుంటే షెడ్డు కాపురమంతా సినిమా దృశ్యంగా కన్పిస్తూనే ఉండేది నాకు.

కుర్ర జంట కుహూకుహూలు గాని.... నవ్య దంపతుల నాకలోక విహారాలుగాని నా కంతగా ద్యోతకే 'సమయ్యేవి కావు — ఆ షెడ్డు కాపురంలో.

అంతా ఒక నిశ్శబ్ద చలన చిత్రం! మూగ సినిమాలా నడుస్తుండేదా కాపురం నడక !

బాగా పొద్దెక్కిన తర్వాతనే లేచేవాడా బుద్ధూ. వాకిట్లో పడుకున్న 'మరిది'ని అతగాడే నిద్రలేపే వాడు. అటు తర్వాత ఇద్దరూ కలిసి పేపర్లు, పుస్తకాలు, ఏవో కాగితాలు చదవటాలూ వ్రాయటాలూ.... ఆ కాలక్షేపం కొంత చేసే వారు. బోలెడన్ని పత్రికలు తిరగేసే వారు, ఎందుకో? ఏమిటో? బహుశా ఉద్యోగాల వేటలో ఉన్న నిరుద్యోగులేమో? నిరుద్యోగులే అయితే అసలిన్ని పత్రికలు ఎట్లా తెప్పిస్తున్నట్లు! ఇట్లా నిరుద్యోగులు కూడా పత్రికలు కొంటే మన పత్రికల వాళ్లు టాటా బిర్లాల మీద మీసాలు మెలెయ్యరూ?

నా జోక్‌కు నేనే నవ్వుకునే వాడిని. చివరికి నేనొచ్చిన నిష్కర్ష — వారేదో పత్రికాఫీసులో పని చేస్తూ ఉండవచ్చునని !

పది గంటలకల్లా వాళ్లు భోజనాలు చేసే వారు. ఎక్కడికో వెళ్లిపోయేవారు. అటు తర్వాత అరగంటలో ఇల్లు సర్దేసుకొని రౌండ్లకి బయలుదేరేది సరళ. ఇక రాత్రికి వాళ్ళెప్పుడు వచ్చేవారో ఏమిటో నేనెప్పుడూ గమనించలేదు. పట్టణ జీవితాల్లో పక్కవాడి వైనం తెలియక పోవటం ఉంటుంది కాబట్టి, నేనూ పెద్దగా పట్టించుకునే వాడిని కాదు. సభ్యత కాదనే బెరుకుతో సరళను కూడా వాళ్ల వివరాలు అడిగే వాడిని కాదు.

"తాతయ్యా, మోడలింగు బొమ్మగారికీ చీరెలన్నీ శ్రీ కృష్ణ భగవానుడే యిస్తాడనుకో. మరైతే ధుశ్శాసనుడెవరంటావు?" పురాణ వైరం ఉన్న మనిషిలా మాట్లాడటం ఆమెకలవాటేనని నాకు తర్వాత తెలిసింది.

"అల్లరి పిల్లా, తప్పుకదూ, పెద్ద వాళ్ళనలా..."

"సారీ తాతయ్యా. ఏమనుకోకేం. కాని యింత వయసులో కూడా ఆమె గారికీ చీరెల పిచ్చేమిటి చెప్పు" అంతలో సీరియస్సు అయిపోయింది సరళ.

"ఏం మీ ఆయన కొనిస్తే నువ్వు మటుకు నిమిషానికో చీరె ధరించవా ఏమిటి?" కవ్వించబడిందామె "ప్రతి

పృమోద్ : నేను ఈ ఊరి నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నా.
స్నేహితుడు : ఎందుకు?
పృమోద్ : మా ఆఫీసులో చందన టైపిస్టు ట్రాన్స్‌ఫర్ అయ్యింది కదా... అందుకు

బి. శ్రీనివాస్
చౌటుప్పల్



దానికీ ఆయనా, ఆయనా అంటావేమిటి? ఎవరో కొనిచ్చేదేమిటి — కావాలంటే నేనే కొనుక్కొని ఊరేగలేనా? ఎవరో కొనివ్వలేదనే, నేనీ ఒంటి చీరెతో నెట్టుకొస్తున్నా? నా కసలాంటి షోకులంటేనే అసహ్యం" అందామెచీదరించుకుంటున్నట్లుగా.

"ఏం, ఎందుకని? చీరెలు,నగలు, అలంకారాల మీద ఆడపిల్లల కందరికీ మోజు ఉంటుంది గదా?"

"ఛీ, ఛీ. అవన్నీ కాపిటలిస్టు స్వర్గాలు. అట్లాంటిమోజులున్న దాన్నయితే, చక్కగా ఇంజనీరునే..." స్విచ్ ఆఫ్ చేసిన రేడియోలాగా టక్కున ఆగిపోయింది — సరళ.

నా అనుమానమేదో బలపడినట్లయింది.

"అబ్బే... అదేం లేదు తాతయ్య. కావాలనుకుంటే ఏ యింజనీరో డాక్టరో అయి ఉండేదాన్ని కదా — అని. 10+2లో మా జిల్లాకే నేను ఫస్టువొచ్చాను తెలుసా." తన కంగారుతోపాటు, మరేవో కఠోరవాస్తవాలను దాచటానికై ఆమెచేస్తున్న ప్రయత్నం నాకు తెలుస్తూనే ఉంది. డెక్కపట్టినట్లయింది నాకు.

"మరైతే నువ్వేం కావాలని అనుకున్నావమ్మా?" అనునయంగానే అడిగాను. నా ప్రశ్న ఆ పిల్లకు పిడుగుపాటులా తగిలిందా?

"ఈ బుద్ధూ మొగుడితో, ఈ చిన్నిరేకుల షెడ్డు కాపురం కావాలనుకున్నావా? మీదేమన్నా ప్రేమ వ్యవహారమా?" అనురాగం వేయించిన ప్రశ్నలే అవి.

"ఛ ఛ అవన్నీ బూర్జువాల కబుర్లు. నా కట్లాంటి...." మరోసారి రేడియో స్విచాఫ్ అయిపోయింది.

కాపిటలిస్టు స్వర్గాలు! బూర్జువా కబుర్లు — ఏమిటీ పిల్ల మాట్లాడుతున్న భాష! నాకేదో పట్టిచ్చినా, ఇక అప్పుడా సంభాషణ పొడిగించదలుచుకోలేదు.

కొంత సేపటికేదో తేరుకున్నది. సరళ.

"ఏయి తాతయ్యా... ప్రేలూ దోమలూ, చీరెలూ సింగారాలూ... యిట్లాంటి పాడు కబుర్లు కాకుండా, నాకేమన్నా కాస్తమంచి కబుర్లు చెప్పకూడదూ?"

మాట మార్చిందామె. మార్చనిచ్చాను.

... ... ... ...

పావ్‌లోవ్ కుక్కలా మర్నాటి మధ్యాహ్నం సరళ రాక కోసం ఎదురు చూశాను. ఆ మెందుకో ఆ పూట రాలేదు. రేకుల గది తలుపులు మూసి ఉన్నాయి. ఆమెతో కబుర్లు మేత గంటా, చికాకుతోనే గడిచింది. మందులు వేసుకుని నిద్రకు ఉపక్రమించినా ఆ పిల్ల ఆలోచనలు నన్ను వదలి పెట్టలేదు. మన సమస్యలకు మూలం మన ఆలోచనలే నంటారు జిడ్డువారు. అసలు ఆలోచనలే లేకపోతే!

ఆలోచిస్తూనే టిఫిను చేస్తున్నాను — నిద్రానంతరం. అదిగో అప్పుడొచ్చింది సరళ. డొక్కుపోయిన మొగంతో, చెదిరిన ముంగురులతో. పెదవులు మటుకు నవ్వుతో విచ్చుకునే ఉన్నాయి.

"ఏయి తాతయ్యా! అమ్మమ్మ చేసిన గారెలన్నీ నువ్వే తినేస్తున్నావా?" — "వాటి మీద కెగపడింది సరళ. ఎన్నడూ ఎరుగని విధంగా. అమ్మమ్మ గారెలను ఆబగా తినేసింది.

"ఇదిగో ... నిన్నే ... సరళ తల్లికి కొంచెం సలాడ్ పెట్టు" కేక పెట్టాను. గలగల్లా నవ్వేసింది సరళ... మల్లెలు వెదజల్లినట్లుగా.

"అయితే తాతయ్యా! అమ్మమ్మ పేరు ఇదిగో... నిన్నే.. అనా?" కిలకిలమన్నది సలాడ్ తినేస్తూనే.

"ఆ... ఏంటమ్మా కబుర్లు... మధ్యాహ్నం రాలేదేమిటి?"

"యుద్ధం తాతయ్యా... వార్. వార్ ప్రకటించేశానుగా" జ్యోతుల్లాంటి కళ్ళతో ఏవో విన్యాసాలు చేసింది.

"యుద్ధమే ఎవరి మీద? రాజుమీద నేనా?" ఆమె భర్త పేరు నాకు తెలిసినట్టు నటించాను?

"రాజా రాజెవడు తరాజు" నా కళ్ళల్లోకి చురుగ్గా చూసిందామె.

"అతని పేరు రాజు కాదా పోన్లే. ఇంతకూ మీ ఆయన మీదనేనా యుద్ధం?"

"అవును 'ఆయన' మీదే" ఆ మాటను నొక్కి పలికింది సరళ.

"ఎక్కడ వంటింట్లోనా, పడకటింట్లోనా? పడకటింటిలో అయితే నువ్వే జయించి ఉంటావులే" వయసు వల్ల వచ్చిన 'తెంపరితనం' తో అడిగాను.

"అబ్బో తాతయ్యా సెక్సు మాట్లాడుతున్నారే! ఆహా... ఫర్వాలేదు. అయితే పడకటింటి యుద్ధంలో మా అమ్మమ్మదే నన్న మాటపైచేయి" ఏమీ సిగ్గుపడకుండా ఎంతో హాయిగా ఆమె అలా మాట్లాడడం, చెప్పొద్దూ నాకు ముచ్చటేసింది.

"అసలింతకీ యుద్ధమెందుకో ఏమిటో చెప్పనే లేదు."

"అదే రోజు వంట నేనే ఎందుకి చెయ్యాలి. ఇవ్వాళ నలభీమ పాకాలు నువ్వు చెయ్యమని 'ఆయన' మీద యుద్ధం ప్రకటించేశాను." దర్జాగా చెప్పింది సరళ.

"మంచి యుద్ధమే. మరి వంట చేశాడా?"

"చేస్తాడూ? పురుషాహంకారం. ఎన్ని సిద్ధాంతాలు వల్లించి ఏం లాభం?"

"ఏం సిద్ధాంతాలు వల్లిస్తాడేమిటి, మీ ఆయన?"

"పసిగట్టినట్లున్నది. "అదిగో తాతయ్యా మళ్లీ మాట మారుస్తున్నావు. అవునూ, వంటెప్పుడూ ఆడవాళ్లే చెయ్యాలా?" మాట మార్చేసిందా మెరుపుతీగె.

"అంటే, వంట చెయ్యనే లేదన్న మాట."

"చెయ్యలేదు కాబట్టే అమ్మమ్మ గారెలన్నీ తినేశాను గాని, మాట మళ్లించకు. వంటెప్పుడూ ఆడవాళ్లే చెయ్యాలా? అది చెప్పు ముందర."

నన్నడిగితే నేనేం చెప్పగలనమ్మా, మాంధాతల కాలంవాడిని. మా ఇంట్లో మటుకు వంటెప్పుడూ మీ అమ్మమ్మే చేసేది— ఆ మూడు రోజులూ తప్ప."

"అదిగో... ఆ మూడు రోజులూ... అదో అసహ్యం." చిరాకుగా ముఖం పెట్టిందామె.

మీ అమమ్మ అట్లా అనుకునేది కాదమ్మా. ఆ మూడు రోజులూ నాచేత అందింపులు అందించుకుని మహదానందపడిపోయేది— నన్ను హింసిస్తూ."

"అహహ... తాతయ్యా, నువ్వు దొంగరాస్కెల్‌వి." చనువుగా అనేసి పడీ పడీ నవ్వింది శలాక. తేట పడిందామె ముఖం.

కావాలని నేను మూతి ముడుచుకున్నాను.

"సారీ, తాతయ్యా. అతని మీద కోపంతో నిన్ను మాట తూలాను." సంస్కారవతి సరళ.

"ఒ.కే. సరళమ్మ తల్లీ. ఇప్పుడు నీ కోపం తగ్గింది కదా!"

"తగ్గింది కాని, నా ప్రశ్నకు సమాధానం చెప్పు. వంటెప్పుడూ ఆడవాళ్ళే ఎందుకు చేయాలి?"

"నేనేం చెప్పగలనమ్మా. మారుతున్న కాలం. మారిపోతున్న విలువలు. మేము నమ్మిన వాటితో బేరీజు కుదరక తబ్బిబ్బుపడుతున్న వాళ్లం. నేనేం చెప్పగలను? కాకపోతే ఒక్కమాటంటాను. నీకు మళ్లీ కోపం రాదంటే. వంట చేయడం, పిల్లల్ని పెంచడం, ఇల్లు సంబాళించుకోవడం — వీటిల్లో స్త్రీకి బోలెడంత తృప్తి ఉంటుందమ్మా. అదో బానిస చాకిరీ కాదు. పని విభజన. అనువైన ధార్మిక వాతావరణం. సజావైన సామాజికపు పరిస్థితులే ఉంటే."

"మరవి రావాలంటే?" క్రాస్ పరీక్ష మొదలెట్టింది.

"పరాయీకరణ పోవాలి మన భావాలలో. ఆర్థిక సమస్యలకు ఆన్సరు అమెరికాలో... సాంకేతిక విజ్ఞానం రష్యాలో... సామాజిక సమస్యలకు పరిష్కారం చైనాలో... దొరుకుతుందనే వ్యామోహం పోవాలి. అవన్నీ మన ధర్మంలోనే మనకు దొరుకుతై— చట్టబద్ధమైన పరిపాలన అనేది ఒక్కటి వస్తే చాలు." కొంచెం తీవ్రంగానే పలికింది నా గొంతు. ఏనాడూ వాక్యరూపమివ్వని నా భావనలకు సరళ గొంతు ఎరువిచ్చినట్లయింది.

"అబ్బో, తాతగారికి పెద్దపెద్ద ఐడియాలే ఉన్నాయే." నా మాటలకే కొంచెమే కోపమొస్తే నన్ను 'తాతగారని' సంబోధించేది సరళ.

"మరైతే ఇవన్నీ ఆచరణాత్మకమేనంటావా?"

"ఆలోచనలకు ముందు ఒప్పొందల లభిస్తే ఆచరణ అదే సాధ్యమవుతుంది."

"ఈ గొడవంతా లేకుండా సాఫీగా వర్గశత్రు నిర్మూలనా మార్గమే అనుసరించవచ్చును గదా?" అడగవద్దనుకుంటూనే అడిగినట్లున్నది సరళ.

వర్గ శత్రువులు. నిర్మూలనం — అర్థమైంది. ఆ బుద్ధూగాడు ఈ పిల్ల వరసేమిటో కొంచెం అర్థమేనట్లే ఉంది. ఏం చెప్పను నేను?

"మాట్లాడవేం తాతయ్యా?"

"ఏం మాట్లాడనమ్మా?" "మంచి చెడులని ఎంచి చూడగ మనుజులందున




ఆండాళ్ : నిన్ను పెళ్ళి చేసుకోబోయే ఆనంద్ పట్టుదల గల వ్యక్తి.
తాయారు : నీకెలా తెల్సు?
ఆండాళ్ : ఇదివ రకు నా వెంటపడుతుంటే చెప్పుతో కొట్టా, అయినా నిన్ను ప్రేమిస్తున్నానంటూ వెంటపడటం మానలా ఇప్పటివరకూ...
తాయారు : ???

రెండే కులములు" అన్నాడు మహాకవి. అట్లాగే మంచివారు, చెడ్డవారు — రెండే వర్గాలు మనుజుల్లో. మంచివారు చెడ్డవారిని నిర్మూలించుకుంటూ పోతే ఇక వీరి మంచేం మిగులుతుందమ్మా? కాకపోయినా ఈ గొడవంతా చిన్నపిల్లవు నీకెందుకు? హాయిగా వెళ్లి శుభ్రంగా స్నానం చేసి ఇంత ఉడకేసి నీహారికలాగా మీ ఆయనకోసం ఎదురుచూస్తూ కూర్చో." అనునయంతోనే చెప్పాను.

స్ఫటికశిలలా ద్రవించిపోయింది సరళ.

"అతను నా భర్తకాడు తాతయ్యా." ఉరికివస్తున్న మాటను అణచిపెట్టుకున్నదామె. ఏదో అంటూనే వెళ్లిపోయిందా మబ్బుతునక.

* * *

ఈ కథ యిక్కడితో ఆగిపోలేదు. సుమారొక నెల రోజుల తర్వాత నాకో షెద్ద జాబు వచ్చింది — రిజిస్టరు పోస్టులో.

సరళ వ్రాసిన ఉత్తరం. ఆతృతగా చదువుకున్నాను. అమ్మమ్మకు వినిపిస్తూనే. చదువుకొని, గుండెలవిసి పోయేట్లుగా ఏడ్చాం — వృద్ధ దంపతులం !

* * *

"మహా రాజశ్రీ తాతయ్యగారికి,

నమస్కారములు.

"చూశావా తాతయ్యా, నీ మీదనాకెంత కోపం వచ్చిందో? అంత సంబోధన ఎందుకు చేశానంటావు. సింపిల్‌గా తాతయ్యా అనకుండా. నీ మీద నాకు చచ్చేటంత కోపం వచ్చింది కనుక.

"చచ్చేటంత—శ్లేషా, అతిశయోక్తా అని ప్రశ్నలు వెయ్యబోకు. నువ్వసలే జిడ్డు గ్రామరు మేష్టరువని అమ్మమ్మ చెప్పిందిలే. అది అతిశయోక్తే. ఎందుకంటే నేను చావను.

"అసలింతకీ నీమీద ఎందుకింత కోపం వచ్చిందో చెప్పలేదు గదూ? అవునూ, నువ్వసలు దొంగ తాతయ్యవు కాకపోతే, నా జీవితంలోకి దొంగచాటుగా ఎందుకొచ్చావు? అమ్మమ్మ, రాజీ, అన్నయ్యలు వీళ్లందరినీ నీ జీవితంలోకి ఎందుకు ప్రవేశపెట్టావు—తలతిక్క రచయితకుమల్లే ! పోనీ వచ్చావయ్యా, యిప్పుడా నా జీవితంలోకి 'నువ్వు' వచ్చేది? ఓ పదేళ్ల క్రిందట ఎందుకు రాలేదు? కొండ కొమ్మమీద నించొని... ఒన్, టూ, త్రీ చెప్పుకున్న తర్వాత యిప్పుడా నువ్వు వచ్చేది? వచ్చి ఏం చేయగలవని వచ్చావు? అంతగా రాదలచుకున్నవాడివి కనీసం ఐదారేళ్లకు ముందైనా—నేను ఆర్.యి.సి.లో చదువుతున్నప్పుడైనా ఎందుకు రాలేదు? అప్పుడేమో ఆ మర్కటం మేష్టారొచ్చారా, నా జీవితంలోకి ! ఇప్పుడేమో— ఇంత లేటువయసులో— నువ్వొస్తావా? అందుకే నాకు నీమీద చచ్చేటంత కోపంగా ఉంది.

"అవునుకదూ. నీకు చెప్పలేదు కదూ. నేను వరంగల్లు ఆర్.ఇ.సి.లో ఇంజనీరింగు చదివాను. అండ్ ఫర్ యువర్ ఇన్ఫరమేషన్—నా పేరు సరళ కాదు. నేనా 'బుద్ధూ' భార్యనూ కాదు. జస్ట్— వియ్ లివ్ టుగెదర్. కలిసి ఉన్నాం— అంతే. అట్లా జీవించటంలో తప్పేమీ లేదని 'సశాస్త్రీయంగా' నిరూపించారు — మా మర్కటం మేష్టారు. ఆర్.యి.సి.లో మెకానికల్ ఇంజనీరింగ్ లెక్చెరరు. ఆయనే నన్ను ఉయ్యాల ఎక్కించారు. ఇకప్పటినుంచీ క్రిందకూ మీదకూ ఊగుతూనే ఉన్నాను. వాళ్లూ వీళ్లూ వస్తున్నారు. ఉయ్యాల ఊపులు వేస్తున్నారు. వాళ్లు దానిని ఆగనివ్వరు. నేను ఆపుకోగలను. కాని ఆపుకోను.

"అవునసలు ఎందుకు ఆపుకోవాలి తాతయ్యా. ఈ సమాజం, ఈ మనుషులు, ఈ రాచరికం— ఏమిటీ వంకరలు ! అన్నీ వికృతులే. వికారాలే. నేడూ రేపూ బడాబడాలు చెయ్యని పాపం ఉండటంలేదు— ఆత్మహత్య తప్ప ! వీటి నన్నింటినీ సాఫు చెయ్యాలంటే, ఉయ్యాలమార్గమొక్కటే మార్గమని మా మర్కటం మేష్టారు మమ్మల్ని ఒప్పించారు. ఒప్పుకునే ఉయ్యాల ఊగటం మొదలు పెట్టాను. నేనెందుకు ఆపుకుంటాను? నో, ఐ వోంట్ గెట్ డవున్.

'కాని నువ్వేం చేశావు—రాస్కెలు తాతయ్యవి. ఉయ్యాలకాస్తా టక్కున ఆపేసి, కాలిబాట చూపించేశావు. ఉయ్యాలమార్గంలో ముందుకెళ్లటం ఉండదని అన్యాపదేశంగా సూచించావు. రాజీని తీసుకొచ్చి నాముందు నిలబెడతావా—రాస్కెలు తాతయ్యా—నిన్నసలు క్షమించకూడదు. ఆ పిల్లేం చేసిందో తెలుసా— మృత్యువు తర్వాత మార్పులేమిటక్కా. నథింగు రిమైన్సు ఆఫ్టర్ డెత్ — అని నన్నే దబాయించింది. ఆ పిల్లకు నువ్వు చూపిన కాలిబాటే రాచబాట.

"అసలింతకీ ఏంటమ్మా నీ మార్గం? ఎక్కడో ఒక్క అనాథపిల్లను తెచ్చి పెంచితే లోకకళ్యాణం జరిగిపోతుందా? ఎగుడుదిగుళ్లు సర్దుకుంటయ్యా? బుల్‌షిట్—ఇదంతా వ్యక్తివాదం. వర్గశత్రు నిర్మూలనం జరుగకుండానే లోకం సాఫు అయిపోతుందా? నో, ఐ డోంట్ బిలీవ్ యిట్. నువ్వేమైనా అను తాతయ్యా, ఐ డోంట్ లైక్.యూ. యు ఆర్ ఎ డైవర్షనిస్టు !

"అయినా నువ్వో నవ్వు నవ్వి ఊరుకుంటావులే. బుద్ధూగాడికో డైవర్సు పత్రం గీకలేక కాదు. బట్ ఐ డోంట్ వాంట్ టు డు యిట్. ఏం నువ్వు ఇంత ఆలస్యంగా నా జీవితంలోకి వచ్చి, ఉయ్యాల ఊపు ఆపేస్తే, నేను దిగివచ్చేయాలేం ! నో. నేనలా ఊగుతూనే ఉంటాను. అఫ్‌కోర్సు, నువ్వు దొంగతాతయ్యవు. భూమ్యాకర్షణ శక్తికి మించిన శక్తితో— అదేలే, నువ్వది అనురాగ మంటావనుకో

అంతశక్తితో నన్ను క్రిందికి లాగాలని చూస్తున్నావు. కృష్ణశాస్త్రి కొచ్చిన కవిత్వం మాకూ వచ్చు. దిగిరాను దిగిరాను, దివినుండి భువికి. నేను నీ ట్రాప్‌లో పడను. ఉయ్యాల ఊపుతో అటునుంచటు పైకన్నా వెళ్లిపోతాగాని, క్రిందకుమటుకు దిగను. నువ్వు చూపించే కాలిబాట నువ్వు నాకు చాల ఆలస్యంగా చూపెట్టావు. ఐ కాంట్ ఫర్‌గివ్ యు..

"పోతే పోయిందిలే. వదిలి పోయిందని మురిసిపోతున్నావేమో? ఇటీజ్ ఎ ప్రామిస్ తాతయ్యా. నేను నిన్ను విడిచి వెళ్లను. వదిలిపెట్టను.

నీ

ఉయ్యాల భామ"

"నేనూ నిన్ను విడిచిపెట్టలేనమ్మా. నువ్వు ఏ ఎత్తుల్లో ఎగురుతున్నా, దింపి తెచ్చి, నాతోపాటు కాలిబాటనే నడిపించుకుపోతాను. యు నాటీ గర్ల్. నేనూ నిన్ను వదిలిపెట్టను. ఇటీజ్ ఎ ఛాలెంజి". భళ్లుమన్నాడు తాతయ్య. ●